నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 20 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET

# అర్హులు 977..రుణమాఫీ 192

- గందరగోళంగా జాబితా
- ఆందోళనకు గురవుతున్న రైతాంగం

కల్వకుర్తి, జూలై 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రైతుల్లో గందరగోళం నింపింది. రైతులకు రూ.2లక్షల రుణాలను మూడు విడుతల్లో మాఫీ చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. మొదటి విడుతగా రూ.లక్ష వరకు రుణాలను ఈనెల 18న మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అందుకనుగుణంగా ప్రభు త్వం 17 సాయంత్రం వరకే జిల్లాల వారీగా రూ. లక్ష రుణ మాఫీకి అర్హత కలిగిన రైతుల జాబితా ప్రకటించింది. 18న రుణమాఫీ చేశామని ముఖ్యమం త్రి స్థాయి నుంచి గల్లీ లీడర్ వరకు సంబురాలు చే సుకున్నారు. ఒక వైపు కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకొంటుంటే.. సంబురాల్లో పాల్గొనాల్సిన రైతులు మాత్రం రుణమాఫీ జాబితాలో పేర్ల కోసం బూతద్దం పెట్టి మరీ వెతుకుతున్నారు.

**కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో..**

కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో 1407మంది రైతులు పంట రుణాలు పొందారు. అందులో 977 మంది మంది రైతులకు రూ.లక్షలోపు, 293 మంది రైతులకు రూ.1.50లక్షలలోపు, 137 మంది రైతులకు రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీలో 977 మంది రైతులకు సంబంధించి రూ.4,29, 14, 960కి గానూ కేవలం 192 మంది రైతులకు సంబంధించి రూ.95,90,704 మాఫీ అయినట్లు జాబితాలో వచ్చింది. అంటే 785 మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ రాలేదన్న మాటే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొన్నది.

**రుణమాఫీపై తిరకాసు...**

రుణమాఫీపై ప్రభుత్వం ఇచ్చిన జీవో ఒకటైతే.. ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం అందుకు భిన్నంగా మాట్లాడుతున్నారు. రుణగ్రహీతలైన అర్హుల ఎంపికకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటామని ప్రభుత్వం ఇచ్చిన జీవోలో ఉంటే, ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం రైతులను గుర్తించడానికే రేషన్‌కార్డు అని చెబుతున్నారు. పట్టాదార్ పాసు పుస్తకం ఉండి వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ రైతులే. ఇందుకు రేషన్‌కార్డు నిబంధన ఎం దుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఐటీ చెల్లించే వారి విషయంలో కూడా మంత్రులు తలోవిధంగా చెబుతున్నారు. ఎవరెన్ని ఏవిధంగా చెప్పినా.. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితా మా త్రం ఇచ్చిన జీవో ప్రకారమే ఉందని, అందుకే 25 శాతం రైతులు కూడా రుణమాఫీకి అర్హత సాధించలేదని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**అసలు, వడ్డీ కలిపి మాఫీ చేస్తారా..?**

2023 డిసెంబర్ 9 కటాఫ్ తేదీ వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తామని జీవోలో ప్రభుత్వం పేర్కొన్నది. రైతులు తీసుకున్న రుణాల అసలు వరకే మాఫీ చేస్తారా.. వడ్డీ కూడా చేస్తారా అన్న ప్రశ్నలు రైతుల నుంచి తలెత్తుతున్నాయి. ఉదాహరణకు జంగయ్య అనే రైతు ఒక బ్యాంక్‌లో 2021లో రూ.60వేలు పంట రుణం తీసుకున్నాడు. 2023 డిసెంబర్ వరకు అసలు మిత్తి కలి పి రూ.75వేలు అయ్యిందనుకుంటే, ప్రభుత్వం ఎంత రుణమాఫీ చేస్తుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కేవలం అసలు మాత్రమే మాఫీ చేస్తుందా.. అసలు, మిత్తి కలిపి చేస్తుందా అనే సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొంత మంది బ్యాంకర్లు మిత్తి కడితేనే అసలు మాఫీ అవుతుందని చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### 20 శాతం రైతులకు కూడా మాఫీ కాలేదు..



ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారం రూ.లక్ష వరకు రుణాలు 20శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదని తెలుస్తుంది. చాలా మంది రైతులు మాకు ఎందుకు రుణమాఫీ కాలేదు. రూ.లక్ష వరకు మాత్రమే మాకు రుణం ఉంది కదా.. మీరు మా పేర్లు పంపించలేదా అని ఫోన్లు చేసి మరీ అడుగుతున్నారు. మరి కొందరైతే పార్టీల వారీగా రైతులను విభజించి రైతు రుణమాఫీ చేస్తున్నారా అంటూ అమాయకంగా అడుగుతున్నారు. ఎం చెప్పాలో అర్థం కావడం లేదు. రుణమాఫీ జాబితా అంతా గందరగోళంగా ఉన్నది. ప్రభుత్వం ఏ పద్ధతిన రైతులకు రుణాలు మాఫీ చేస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది.

– తలసాని జనార్దన్‌రెడ్డి, పీఏసీసీఎస్ చైర్మన్, కల్వకుర్తి

### రైతుబంధు ఎగ్గొట్టడానికే సర్కారు డ్రామా..



వానకాలం పెట్టుబడులకు సంబంధించిన రైతు బంధు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సింది. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తులు వేసింది. రుణమాఫీ చేస్తున్నామని అట్టహాసంగా తేదీని ప్రకటించిన ప్రభుత్వం మొదటి విడుతగా రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి సంబురాలను ప్రారంభించింది. తీరా చూస్తే 25శాతం మంది రైతుల పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయి. నిజంగా సంబురాలు చేస్తే.. అందులో రైతులు ఎందుకు పాల్గొనడం లేదు. ప్రభుత్వం జీవో ఒక విధంగా ఉంటే.. ముఖ్యమంత్రి, మంత్రులు మరో విధంగా మాట్లాడుతారు. అధికారులు మాత్రం జీవో ప్రకారం పనిచేస్తారు. అందుకే చాలా మంది రైతుల రుణాలు మాఫీ కావడం లేదు.

–బీ. రాంచంద్రారెడ్డి, కేఎల్ఐ రైతు, జేఏసీ నాయకుడు, కల్వకుర్తి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## ప్రతిరైతుకూ రుణమాఫీ చేయాలి

- జీవోలకు.. సీఎం మాటలకు సంబంధం లేదు
- ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలి
- రైతులకు అన్యాయం జరిగితే వారి తరపున పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, జూలై 19 : పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భూత్పూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణ మాఫీ విషయంలో జీవోలకు, సీఎం మాటలకు పొంతన లేకుండా ఉన్నదన్నారు. అధికారులు జీవోల ప్రకారంగానే పని చేస్తారని, రేషన్‌కార్డు ఆధారంగా కాకుండా పాస్‌బుక్‌ను చూసి రుణమాఫీ చేయాలని కోరారు. చాలా మందికి రూ.50వేలు రుణం ఉన్నా మాఫీ కాలేదని రైతులు రోడ్ల మీదకు వస్తున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం జీవోలను మార్చి రుణమాఫీ చేస్తే ఎక్కువ మంది రైతులు లబ్ధి చేకూరుతుందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 39లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తే ఇప్పుడు కేవలం 11లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కేవలం 30శాతం మంది రైతులకు మాత్రమే చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు కాకమ్మ కబుర్లు చెప్పి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. డిసెంబర్ 9లోగా రుణమాఫీ చేస్తానని చెప్పి జూలైలో కూడా చేయకపోవడం రైతులపై ఈ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తుందో అర్థమవుతుందన్నారు. ఉత్తదానికే కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు చేయడం విడ్డూరంగా ఉందని, ఆగస్టు15వ తేదీలోగా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని, రుణమాఫీ అమలు కానీ రైతుల తరపున బీఆర్‌ఎస్ పోరాడుతుందని ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మనెమోని సత్యనారాయణ, నర్సింహాగౌడ్, మురళీధర్‌గౌడ్, సాయిలు, గోప్లాపూర్ సత్యనారాయణ, మహమూద్, వెంకట్రాములు, గడ్డం రాములు, రామునాయక్, తిరుపతయ్య, రాకేశ్, యాదయ్య, లక్ష్మయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## రైతులందరికీ వర్తింపజేయాలి : బీరం




కొల్లాపూర్, జూలై 19 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్ర కారం రూ.2లక్షల రుణం తీసుకున్న రైతులందరికీ రాజకీయాలకు అతీతంగా రుణమాఫీని వర్తింపజేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా ఉందని విమర్శించారు. చాలా మంది రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదో బ్యాంకు వాళ్లు చెప్పలేని స్థితిలో ఉన్నారంటే ఇది చిత్తశుద్ధి లేని రుణమాఫీ ప్రక్రియ అని అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. రూ.20 వేలు తీసుకున్న సన్నకారు రైతులకు కూడా నిబంధనల పేరుతో రుణ మాఫీ చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రుణమాఫీ కాని రైతుల వివరాలను తీసుకొని రూ.2లక్షల లోపు రుణాలు మొత్తం మాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా కటాఫ్ తేదీ నుంచి అందరి రైతుల రుణాలను మాఫీ చేయాలని అలాగే పాత అప్పుల కింద రుణాలు జమ కాకుండా రైతులకు కొత్త రుణాలను ఇవ్వాలన్నారు. వానకాలం పంటలను సాగు చేసుకునేందుకు రైతులు అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఉందని, వెం టనే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### అసలు మాత్రమే మాఫీ అంటా..

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పింది. నేను రూ.50 వేలు లోన్ తీసుకున్నా. అందుకు వడ్డీ 4వేలు అయ్యింది. వడ్డీ కడితే గాని రుణ మాఫీ కాదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రకటనకు, అ ధికారుల తీరుకు చాలా తేడా ఉంది. ప్రతి రై తుకు రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ అని ప్రభుత్వం ప్రకటించి ఇప్పుడు వడ్డీ కట్టాలని చె ప్పడం వింతగా ఉంది. కొందరికి మాఫీ చేసి మరికొందరికి చేయకపోవడం సరికాదు. ప్ర భుత్వం అర్హులందరికీ రుణాలు మాఫీ చేయాలి

–పరశురాముడు, రైతు, శెట్టిఆత్మకూరు, గద్వాల మండలం



నాగర్‌కర్నూల్‌లోని ఎస్‌బీఐలో వివరాలు తెలుసుకుంటున్న రైతులు

# కొందరికే.. రుణమాఫీ

- సర్కారు సవా'లక్ష' కొర్రీలు
- జాబితాలో భూతద్దం పెట్టి పేర్లు వెతుక్కుంటున్న రైతులు
- తీసుకున్న రుణంలో సగమే మాఫీ..
- సమాచారం తెలుసుకునేందుకు బ్యాంకులకు పరుగులు
- సంబురాలను చూసి ముక్కున వేలేసుకుంటున్న కర్షకులు

*కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన రుణమాఫీ ఉమ్మ డి జిల్లా రైతుల్లో గందరగోళాన్ని సృష్టించింది. రూ.లక్షలోపు రుణం ఉన్నవారందరికీ మాఫీ చేస్తామని చెప్పి తీరా కొంతమంది పేర్లతోనే జాబితా ఇవ్వడంతో మిగతా రైతులు నిప్పులు కక్కుతున్నారు. రుణమాఫీ విడుదల చేశామంటూ ఓ వైపు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మె ల్యేలు, ప్రజాప్రతినిధులు సంబురాలు చేసుకుంటుండగా, మరోవైపు తీసుకున్న రుణం మాఫీ కాలేదని కర్షకులు ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా మాఫీ చేసిన కొందరు రైతుల్లో కూడా సగం రుణం మాత్రమే మాఫీ కావడంతో వివరాల కోసం బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. మిగతా వారు అధికారులు ప్రకటించిన జాబితాలో తమ పేర్ల కోసం బూతద్దం పెట్టి మరీ వెతుక్కునే పరిస్థితి నెలకొన్నది.*

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూలై 19

### రైతులందరికీ మాఫీ చేయాలి..



కేసీఆర్ ప్రభుత్వంలో రూ.38 వేలు రుణమాఫీ అయ్యింది. కాంగ్రెస్ ప్ర భుత్వం రూ.లక్షలోపు వారందరికీ మొదటి విడుతలో రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పడంతో వడ్డీ కట్టలేదు. రెన్యువల్ కూడా చేసుకోలేదు. కానీ ప్ర భుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో బ్యాంకుకు వెళ్తే రూ.70 వేలు బాకీ ఉందని కట్టమంటున్నారు. ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా రుణాన్ని మాఫీ చేయాలి.

– సజ్జల నర్సింహులు, రైతు, కేశవ్‌పూర్ గ్రామం



మహబూబ్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఏడీబీలో పేర్లు చూసుకుంటున్న రైతులు

### రైతుబంధు డబ్బులను మళ్లించారు..



కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇదివరకే రైతుబంధు ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుబంధుపై ఇంకా తేల్చకుండా సమావేశాల పేరుతో కాలం గడుపుతున్నది. వాటికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వం రుణమాఫీ పథకానికి మళ్లించింది. అంతే కాకుండా ఎన్నికల ముందు రైతులందరికీ రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు రూ.లక్షలోపు వారికే చేసింది. అందులోనూ అనేక కొర్రిలు పెట్టి అర్హులకు రుణమాఫీ అందించడం లేదు.

– తూర్పు యాదిరెడ్డి, గార్లపాడు, కోయిలకొండ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

### రూ.90వేలే మాఫీ అయ్యాయి..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పి ఓట్లు వేయించుకున్నది. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల తర్వాత మొక్కుబడిగా రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పింది. నాకు రూ.2లక్షల రుణం ఉండగా కేవలం రూ.90 వే లు మాత్రమే మాఫీ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ చె ప్పిన దానికి, చేసిన దానికి పొంతన లేదు. ఇది పూర్తిగా రైతులను మోసం చేయడమే.

–నర్సింహ, రైతు, దాసరిదొడ్డి, మక్తల్ మండలం, నారాయణపేట జిల్లా

### ఒక్క రూపాయి కూడా మాఫీ కాలే..



ఏపీజీవీబీలో రూ.75 వేల క్రాప్ లోన్ తీసుకోగా ప్రభుత్వం ప్రకటించిన లక్షలోపు రుణాలు మంజూరు అవుతున్న నేపథ్యంలో రూ.75 ఉన్నా నాకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. ప్రభుత్వం అందరికీ ఇచ్చినట్లు చెప్పుకుంటున్నది కానీ నాలాంటి చాలా మంది రైతులకు రుణమాఫీని అమలు చేయడం లేదు. ప్రభుత్వం అర్హులైన ప్రతిరైతుకు రుణమాఫీ పథకాన్ని వర్తింప జేయాలి.

– రామిని సునీత, రైతు, పంచలింగాల, మక్తల్ మండలం, నారాయణపేట జిల్లా

### జాబితాలో నా పేరు లేదు..



ప్రభుత్వం మొదటగా రూ.లక్షలోపు అప్పున్న రైతులకు రుణమాఫీ చేసినట్లు చెబుతుంది. నేను రూ.90 వేల అప్పు తీసుకున్నాను. ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో నా పేరు లేదు. కేసీఆర్ సారు హయాంలో రుణమాఫీ అయ్యింది. ఇప్పుడు ఎందుకు రాలేదో.. ఎవరిని అడగాలో తెలియడం లేదు. బ్యాంకుకు వెళ్తే ఎవరూ సమాధానం చెప్తలేరు.

– మంగళిపెద్ద ఆంజనేయులు, రైతు, ధన్వాడ, నారాయణపేట జిల్లా

## ఉరకలేస్తున్న కృష్ణమ్మ

- జూరాలకు భారీ వరద
- 5.882 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- తుంగభద్ర డ్యాంలో 59.056 టీఎంసీల నీటి నిల్వ
- ర్యాలంపాడు @1.18టీఎంసీలు



నీటితో కళకళలాడుతున్న జూరాల ప్రాజెక్టు

గద్వాల, జూలై 19 : కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి భారీగా వరద నీరు వచ్చి చేరేతున్నది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండిపోయాయి. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టులో 22 గేట్లు ఎత్తడంతో జూరాలకు 67వేల క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 318.516 అడుగులు కాగా ప్రస్తుతం 316.880 అడుగులుగా ఉన్నది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్ర స్తుతం 6.523 టీఎంసీలుగా నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 67వేల ఇన్‌ఫ్లో నమోదు కాగా అందులో పవర్ జనరేషన్ కోసం 34, 818, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు– 1,500, భీమాలిఫ్ట్–1కు 1,300, భీమా లిఫ్ట్–2కు 750, జూరాల ఎడమ కాల్వకు 870, కుడి కాల్వకు 367, ప్యారలాల్ కాల్వకు 600, మొత్తం 39,533 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ఎగువ నుంచి కృష్ణానదికి భారీగా వరద వస్తుండడంతో నదీ పరీవాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

**జూరాలకు పరుగులు..**

మక్తల్, జూలై 19 : కృష్ణానదికి ఎగువన కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో శుక్రవారం జూరాలకు కృష్ణమ్మ పరుగులు తీస్తున్నది. మక్తల్ మండలంలోని వల్లభాపురం దత్తక్షేత్రం మీదుగా ఉరకలేస్తున్న కృష్ణమ్మను తిలకించేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు.

**కొనసాగుతున్న ప్రవాహం**

గట్టు, జూలై 19 : నెట్టెంపాడు పథకంలో భాగమైన ర్యాలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటి ప్రవాహం కొనసాగుతున్నది. శుక్రవారం నాటికి రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.18 టీఎంసీలుగా ఉంది. 1,200 క్యూసెక్కుల వరద రిజర్వాయర్‌లోకి వస్తున్నది. రిజర్వాయర్ నుంచి ఎడమ కాల్వ(104ప్యాకేజీ)కు 203 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా కుడి కాల్వ 398 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా ర్యాలంపాడు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4టీఎంసీలు ఉండగా, కట్ట బలహీనంగా ఉండడంతో నీటి నిల్వను 2టీఎంసీల లోపే చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గట్టుకు వచ్చే కాల్వ ప్రవాహం గొర్లఖాన్‌దొడ్డి శివారు వద్దే ఆగిపోయింది. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణం పనుల్లో కాల్వలో మట్టి కూరుకుపోయింది. అధికారులు మట్టిని తొలగించకపోవడం తో నీరురాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వరినార్లు చేతికొచ్చాయని, మ ట్టిని తొలగించి కాల్వలో నీరు ఎప్పటి మాదిరిగానే పారే విధంగా చూడాలని గొర్లఖాన్‌దొడ్డి, గట్టు, మాచర్ల, బలిగేర రైతులు కోరుతున్నారు.



ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నీటి నిల్వ

### టీబీ డ్యాంకు లక్షకు పైగా ఇన్‌ఫ్లో..

అయిజ, జూలై 19 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతున్నది. తుంగ నది పరీవాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాంలో వరద పొంగి ప్రవహిస్తున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 1,08,326 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,180 క్యూసెక్కులుగా నమోదైంది. తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులకు గానూ ప్రస్తుతం 1619.18 అడుగులు ఉన్నది. డ్యాం గరిష్ఠ నీటినిల్వతో 105.788 సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 59.056 టీఎంసీల నీటిమట్టానికి చేరుకున్నది. ఎగువన మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నది.



టీబీ డ్యాంలో నీటి నిల్వ



రాజాపురంలో బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వరం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అయిజ/అయిజ రూరల్, జూలై 19 : నిరుపేద కుటుంబాల్లోని బాధితులు కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ వరమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని మేడికొం డ, ఉత్తనూర్, రాజాపురం, కొత్తపల్లి, భూంపురం తదితర గ్రామాల్లో బాధితు ల ఇండ్లకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా ని యోజక వర్గంలోని ఎంతోమందికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన వివేకానందకు రూ.60వేలు, ఎక్లాస్పురం గ్రామానికి చెందిన సుభద్రమ్మకు రూ.58వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశా రు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రాముడు, రంగారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

## డీఎస్సీకి 705 మంది హాజరు

పాలమూరు, జూలై 19 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయం, జయప్రకాశ్‌నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్సీ పరీక్షలు రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అధికారులు వారిని తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొదటి షిఫ్ట్‌లో 364 మంది అభ్యర్థులకు 345మంది హాజరయ్యారు. రెండో షి ఫ్ట్‌లో 366మందికి 360మంది హాజరయ్యారు. జేపీఎన్‌సీఈ పరీక్షా కేంద్రాన్ని హైదరాబాద్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెంకటనర్సింహారెడ్డి పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.